క్లుప్తంగా

వకుళమాత సేవలో ప్రముఖులు


ఆలయంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి రూరల్: పేరూరు బండపై కొలువైన వకుళమాత అమ్మవారిని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సినీనటి మీనాక్షి చౌదరి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం అద్భుతంగా ఉందని మంత్రి అనగాని సత్యప్రసాద్ కొనియాడారు. ఆలయం ముందు ఉన్న శతాబ్దాల చరిత్ర కలిగిన శాసనాన్ని ఆసక్తిగా తిలకించారు. నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మీడియాకు తెలిపారు.

మళ్లీ వేతన వెతలు!

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఈ నెల కూడా ఉద్యోగులకు వేతన వెతలు తప్పలేదు. జనవరి ప్రారంభమై వారం గడుస్తున్నా ఇప్పటి వరకు జీతాలను ఖాతాల్లో జమ చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోనూ ఉంది. వేతనం అందక ఉద్యోగులు, పెన్షనర్లు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దాదాపు ఆరునెలలుగా వర్సిటీలో సకాలంలో జీతాలు అందడం లేదు. అయినప్పటికీ వర్సిటీ అధికారుల పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త సంవత్సరంలో అయినా ఒకటో తేదీన వేతనాలు వస్తాయని ఆశించిన ఉద్యోగులకు నిరాశే మిగిలింది.

ఆటో వర్కర్ల సమావేశం


ఆటో యూనియన్ సభ్యులు

పాకాల : స్థానిక అంబేడ్కర్ భవన్‌లో బహుజన ఆటోవర్కర్ల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆదివారం ఈ మేరకు అంబేడ్కర్ భవన్ కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ సభ్యులందరూ ఐకమత్యంతో మెలగాలని, ఆర్థిక లావాదేవీలను కచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ఎంఈఓ బాబ్జీ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలతో ఏర్పాటు చేసిన ఈ సంస్థలో సభ్యులందరూ క్రమశిక్షణ పాటించాలని, సంపాదనలో కొంత పొదుపు చేసుకోవాలని కోరారు. పిల్లలను చక్కగా చదివించాలని సూచించారు. సమావేశంలో యూనియన్ నేతల రవి, ఢిల్లీబాబు, ప్రసాద్, మోహన్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఘనంగా 'రెడ్ చెర్రీస్' వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సునీల్‌కుమార్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : నగరంలోని రెడ్ చెర్రీస్ పాఠశాల 13వ వార్షికోత్సవాన్ని ఆదివారం పీఎల్‌ఆర్ గ్రాండ్ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సునీల్‌కుమార్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఒత్తిడి లేని విద్యతో పిల్లలకు ఉజ్వల భవిష్యత్ అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు, ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ వంటి జాతీయ విద్యా సంస్థల్లో సీట్లు సాధించేలా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఎల్లమ్మ ఉత్సవాలపై సమీక్ష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి : గ్రామదేవత మూలస్థానం ఎల్లమ్మ సంక్రాంతి ఉత్సవాల నిర్వహణపై ఎమ్మెల్యే పులివర్తి నాని సమీక్షించారు. ఆదివారం ఈ మేరకు ఆలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాలను వైభవంగా జరిపించాలని కోరారు. ఆలయంతోపాటు ప్రధాన వీధులను విద్యుద్దీపాలతో అలంకరించాలని సూచించారు. పంచాయతీ సిబ్బంది పకడ్బందీగా పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అమ్మవారి కొండ చుట్టు ఉత్సవానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ క్రమంలోనే వాహన బేరర్లకు దుస్తులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

రామచంద్రాపురం: కొత్త నెన్నూరు నుంచి టీటీ కండ్రిగ వరకు గుండోడు కణం రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదివారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు అభివృద్ధికి రూ. 3.15 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. రెండు నెలల్లోనే పనులు పూర్తవుతాయని వెల్లడించారు.

అభినందన



తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. నెల్లూరుకు చెందిన గురుదత్త కళా నిలయం ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. సుస్మిత, దాక్షాయిని, యోషిత, శ్రీలయ, వేద సహస్ర, రుష్మితశ్రీ, శ్రేష్ఠ, మోక్ష, స్ఫూర్తి, సాయి రిషిత, సాత్విక, ప్రణీక్ష, అనుజ్ఞ అభినయ పాతవానికి ప్రేక్షకుల అభినందనలు వెల్లువెత్తాయి. – చంద్రగిరి

అలసత్వం



చంద్రగిరి నియోజకవర్గం దామలచెరువు పంచాయతీ మల్లప్పగారిపల్లెలో తాగునీరు కలుషితమవుతోంది. రెండు వారాలుగా పైప్‌లైన్ లీకవుతున్నా పట్టించుకునే దిక్కేలేకుండా పోయింది. కార్యదర్శి మహేశ్వరికి పలుమార్లు ఫిర్యాదు చేసినా అలసత్వం వహిస్తోందని ప్రజానీకం ఆరోపిస్తోంది. విష జ్వరాలు ప్రబలుతున్నా కదలిక లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇప్పటికైనా స్పందించి మరమ్మతు చేయించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తోంది. – పాకాల

అసహనం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ వచ్చి చేరేది. చౌక దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది కాదు. అయితే కూటమి కొలువుదీరిన తర్వాత నిత్యావసర సరుకులు తీసుకోవాలంటే ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. రేషన్‌షాపు వద్ద క్యూ కట్టాల్సి వస్తోంది. దీంతో గంటల తరబడి వేచి ఉండలేక లబ్ధిదారులు తాము తెచ్చిన సంచులను వరుసలో పెట్టి తమ వంతు కోసం నిరీక్షించాల్సిన దుస్థితి దాపురించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ప్రజల ఆరోగ్యం కాపాడాలి. పరిశుభ్రమైన తాగునీరు అందించాలి. ఇదే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. అప్పటి తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి ఈ మేరకు నిధులు మంజూరు చేశారు. ఈ క్రమంలో సరళమైన ధరకే స్థానికులకు శుద్ధ జలం అందిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కాయిన్ బాక్స్ అమర్చారు. ఎవరితో పనిలేకుండా రూ.5ల నాణెం వేసి నీరు పట్టుకునే వెసులుబాటు కల్పించారు.

సరళం.. సుజలం


సప్తగిరినగర్‌లో ఆర్‌ఓ ప్లాంట్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న స్థానికుడు

కాయిన్ కొట్టు .. నీరు పట్టు

- సప్తగిరినగర్ పంచాయతీలో రూ. 5లకే మినరల్ వాటర్
- ప్రజారోగ్య రక్షణే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు
- అప్పటి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నేతృత్వంలో నిధులు మంజూరు

తిరుపతి మంగళం : ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మంగళంలోని సప్తగిరినగర్ పంచాయతీలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్లాంట్‌ను స్వాధీనం చేసుకునేందుకు పచ్చమూక యత్నించింది. రూ.వేలు దండుకోవచ్చని ఆశ పడింది. అయితే మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచన మేరకు ఉప సర్పంచ్ అశోక్‌రెడ్డి అక్కడ కాయిన్ బాంక్స్ ఏర్పాటు చేయించి రూ.5లకే స్థానిక ప్రజలకు మినరల్ వాటర్‌ను అందిస్తున్నారు.


ప్లాంట్ వద్ద ఏర్పాటు చేసిన కాయిన్ బాక్స్

గతంలో హామీ ఇచ్చి.. మరిచారు

2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో సప్తగిరినగర్‌లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తామని ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నాని హామీలు గుప్పించారు. తర్వాత ఆ ఊసే మరిచారు. తర్వాత వైఎస్సార్‌సీపీ సర్కారులో అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పందించి మంగళంలోని సప్తగిరి నగర్, రణధీర్‌పురం, మంగళం, తిరుమలనగర్‌లో మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయించారు.

స్థానికుల ఆనందం

గతంలో కలుషిత నీటిని సేవించి తరచూ రోగాల బారిన పడేవారమని, వైఎస్సార్‌సీపీ పాలనలో శుభ్రమైన నీటిని అందించి తమను కాపాడారని స్థానికులు వెల్లడిస్తున్నారు. అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాటి తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి నిస్వార్థ ఆలోచన కారణంగానే శుద్ధ జలం అందుబాటులోకి వచ్చిందని వెల్లడిస్తున్నారు. బయట మార్కెట్‌లో రూ.20ల వాటర్‌ను కేవలం రూ.5లకే తీసుకోగలుతున్నామని వివరిస్తున్నారు.

కట్టమీద గంగమ్మకు పూజలు


విశేషాలంకరణలో అమ్మవారు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం చినిగేపల్లె సమీపంలో వెలసిన కట్టమీద గంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సహదేవరెడ్డి, సర్పంచ్ సింహాల విమల పాల్గొన్నారు.

వివేక్‌ను విమర్శిస్తే ఊరుకోం

తిరుపతి కల్చరల్ : దళితుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న తెలంగాణ ఎమ్మెల్యే వివేక్‌ను ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శిస్తే ఊరుకోమని దళిత నేతలు మల్లారపు మధు, పి.ప్రభాకర్ హెచ్చరించారు. కనీసం సర్పంచ్‌గా కూడా గెలవలేని మంద కృష్ణ స్వలాభం కోసం ఎమ్మార్పీఎస్ ముసుగులో పోరాటాలు సాగిస్తున్నారని ఆరోపించారు. గతంలో చుండూరు, కారంచేడు, పాదిరికుప్పం వంటి ఘటనల్లో దళితులకు అండగా నిలిచిన చరిత్ర వివేక్ కుటుంబానిదే అని వెల్లడించారు. కొందరు నేతలకు కొమ్ముకాస్తూ స్వార్థ రాజకీయాల కోసం వర్గీకరణ పేరుతో దళితులను విచ్ఛిన్నం చేస్తున్న మంద కృష్ణకు వివేక్‌ను విమర్శించే అర్హత లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా తీరుమార్చుకోకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

'వాకర్స్' నూతన కమిటీ ఎంపిక


ఎన్నికైన కొత్త కమిటీ

తిరుపతి కల్చరల్ : గోవిందరాజస్వామి వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. ఈమేరకు ఎస్‌జీఎస్ కళాశాల ఆవరణలో నిర్వహించిన అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశంలో రిటైర్డ్ డీఎస్పీ శంకర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించి కొత్త కమిటీని ఎంపిక చేశారు. కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ చైర్మన్‌గా పీసీ రాయులు, అధ్యక్షుడిగా కె.రఘురామరెడ్డి, కార్యదర్శిగా తోట చక్రపాణి, ఉపాధ్యక్షుడిగా భారతి కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శులుగా ఏ.గోపీ యాదవ్.పి.హరిబాబు, కోశాధికారిగా జి.పోతప్పతో పాటు ఏడుగురు సభ్యులు ఎంపికయ్యారు.

'ఎడ్విన్' ఎడిటోరియల్ మెంబర్‌గా దేవప్రసాదరాజు



తిరుపతి సిటీ : సైన్స్ జర్నల్ ఎడ్విన్‌కు ఎడిటోరియల్ మెంబర్‌గా ఎస్వీయూ ప్రొఫెసర్ బి.దేవప్రసాద్‌రాజు నియమితులయ్యారు. ఆదివారం ఈ మేరకు జర్నల్ ప్రతినిధి నియామక పత్రం విడుదల చేశారు. ఫిజిక్స్ అధ్యాపకుడిగా ప్రస్థానం ప్రారంభించిన దేవప్రసాద్‌రాజు వర్సిటీ అడ్మిషన్ విభాగం జాయింట్ డైరెక్టర్‌గా, హాస్టల్ వార్డెన్‌గా, రీసెట్ కన్వీనర్‌గా, ఫిజిక్స్ విభాగాధిపతిగా సేవలందించారు. ఈ క్రమంలో అరుదైన అవకాశం దక్కించుకున్న దేవప్రసాద్‌రాజును వర్సిటీ అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

'సోలార్ వెండర్స్' కమిటీ ఎన్నిక

తిరుపతి కల్చరల్ : సోలార్ వెండర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన అసోసియేషన్ సమావేశంలో ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి జి.మణికండన్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా మధు, కోశాధికారిగా కిషోర్ నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శి జి.మణికండన్ మాట్లాడుతూ సూర్యఘర్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9885475551 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ విడుదల చేస్తున్న అధికారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను డీఈఓ కేవీఎన్ కుమార్, డీవైఈఓ బాలాజీ ఆదివారం ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్ యాదవ్, సదాశివన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి కుమార్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ తుకారామ్, నేతలు గురుప్రసాద్, మురళీ, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

ఈఆర్‌ఓ తరలింపునకు రంగం సిద్ధం?

పాకాల : ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ ఆవరణలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని చంద్రగిరికి మార్చేందుకు రంగం సిద్ధమైంది. సుమారు 75 ఏళ్లుగా పాకాలలోనే ఉన్న ఈఆర్‌ఓను మార్చేందుకు ఆదేశాలు జారీ అయినట్లు తెలిసింది. దీనిపై స్థానికులు, రైతులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో విద్యుత్ బిల్లులపై ఏదైనా సమస్యలు తలెత్తితే సుమారు 30 కిలోమీటర్లు ప్రయాణించి చంద్రగిరి వెళ్లాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల స్పందించి విద్యుత్ రెవెన్యూ కార్యాలయం మార్చకుండా పోరాడాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి


ఈశ్వరమ్మ (ఫైల్)

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత యనమల ఈశ్వరమ్మ ఆదివారం కన్నుమూశారు. పార్టీ ఆవిర్భావం నుంచి వారి కుటుంబం విశేష సేవలందించింది. ప్రస్తుతం ఈశ్వరమ్మ మనవడు విజయ్‌కుమార్ సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు. ఈశ్వరమ్మ మృతికి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు స్వరూప, మహేంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్ తదితరులు సంతాపం తెలిపారు.

ఈయూ జిల్లా కమిటీ ఎన్నిక

తిరుపతి అర్బన్ : నగరంలోని సీపీఐ భవనంలో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జీఆర్ చంద్ర, కార్యదర్శిగా వి.మస్తాన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డీఎస్ వర్మ, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా బి.సుబ్రమణ్యం, జాయింట్ సెక్రటరీగా కె.రఘు, కోశాధికారిగా ఎస్ఎస్ సుబ్రమణ్యం, ప్రచార కార్యదర్శిగా జె.సతీష్‌నాయుడుతోపాటు మొత్తం 27 మందితో కొత్త కమిటీ ఏర్పాటైంది. ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదర రావు, జీవీ నరసయ్య మాట్లాడుతూ నూతన కమిటీ మూడేళ్లపాటు ఉంటుందని వెల్లడించారు.

దళిత ద్రోహి చంద్రబాబు


నల్లాని బాబు

తిరుపతి మంగళం : దళిత ద్రోహి సీఎం చంద్రబాబు అని, దళితులను ఆయన ఎప్పుడూ చిన్నచూపు చూస్తుంటారని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు మండిపడ్డారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గం తడుకుపేటలో దళితులపై టీడీపీ నేతలు దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఎస్సీల్లో ఎవరైనా పుడతారా అని గతంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడతాయని విమర్శించారు. జగనన్న పాలనలోనే దళితులకు న్యాయం జరిగిందనివెల్లడించారు. కూటమి నేతలు ఇదేవిధంగా వ్యవహరిస్తుంటే ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఉద్యోగ విరమణ సత్కారం


సత్యనారాయణను సత్కరిస్తున్న ఈడీ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : సెంట్రల్ బస్టాండ్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా, ఆర్టీసీ ఈయూ జిల్లా కార్యదర్శిగా విధులు నిర్వర్తించిన తండాయం సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా సత్కరించారు. ఆదివారం నగరంలోని సీపీఐ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు 37 ఏళ్లపాటు సత్యనారాయణ అందించిన సేవలు మరువలేమని కొనియాడారు. ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య మాట్లాడుతూ ఎంప్లాయీస్ యూనియన్ బలోపేతానికి సత్యనారాయణ చిత్తశుద్ధితో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. శేఖర్, ఈయూ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సుబ్రమణ్యం రాజు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆవుల ప్రభాకర్, సెక్రటరీ ఇ.రమేష్ కుమార్, అసిస్టెంటు సెక్రటరీ ఏ.మురగమ్మ, కడప జోనల్ కార్యదర్శి యస్.రాజశేఖర్, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంటు వి.మస్తాన్, జోనల్ చీఫ్ వైస్ ప్రెసిడెంటు ఇ.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలోనే సంతృప్తి


పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న మోహన్‌రామిరెడ్డి

తిరుపతి అర్బన్ : నిస్వార్థ సేవలోనే సంతృప్తి ఉందని జగద్గురు సేవా సమితి అధ్యక్షుడు మోహన్‌రామిరెడ్డి తెలిపారు. ఆదివారం శివజ్యోతి నగర్‌లోని ప్రభుత్వ అంధుల వసతి గృహంలో పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఉదయ్‌భానురెడ్డి, తిరుపతి బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ కమిటీ ముఖ్య కార్యదర్శి ధన్వంత్ కుమార్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ మోహన్‌రామిరెడ్డి సేవలను కొనియాడారు. ఆయన చేపట్టే కార్యక్రమాలకు అండగా ఉంటామని తెలిపారు. సమితి సభ్యులు విశ్వనాథ్, చంద్రశేఖర్, గోవిందరెడ్డి, సందీప్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, పార్వతి, నిర్మల, హీరా పాల్గొన్నారు.

బహుజన రచయితలకు అవార్డులు


ప్రజాకవులను సత్కరిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ లో ఆదివారం బీసీ సంఘర్షణ సమితి వారు బహుజన సామాజిక రచయితలకు పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా వర్సిటీ ప్రాచ్య పరిశోధన సంస్థ సంచాలకుడు ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బహుజనుల అభ్యున్నతితోనే దేశాభ్యుదయం సాధ్యమని వెల్లడించారు. కష్ట జీవుల వాణిని పాలకులకు కళాకారులు, కవులు తెలియజేయాలని సూచించారు. అనంతరం ప్రజాకవులు డాక్టర్ వీఆర్ రాసాని, డాక్టర్ మానీ, ఎమ్ఆర్ అరుణకుమారి, పలమనేరు బాలాజీ, సాకం నాగరాజు, పేరూరు బాల సుబ్రమణ్యం, యండపల్లి భారతిని సత్కరించారు. డాక్టర్ జి.వెంకట నారాయణ, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అక్కినపల్లి లక్ష్మయ్య, సాకం ప్రభాకర్, నంజుండప్ప, డాక్టర్ మస్తానమ్మ, యువశ్రీ మురళి, వర్సిటీ బీసీ నేతలు భాస్కర్, తిరుమలేష్ పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్‌లో 'గ్రీవెన్స్'

తిరుపతి తుడా : తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా తెలియజేయవచ్చని సూచించారు.

అసాంఘిక అడ్డా!



తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారైంది. రాత్రి 8 గంటలు దాటితే వ్యభిచారానికి కేరాఫ్‌గా మారుతోంది. ముఖ్యంగా ఆర్టీసీ డీపీటీఓ కార్యాలయం కింది భాగంలో పలువురు మహిళలు చేరి అటువైపు వచ్చిన పురుషులతో బేరసారాలు సాగిస్తున్నారు. కొందరు దుకాణదారులు సైతం వారికి అండగా నిలుస్తున్నారు. వలలో చిక్కిన వారిని నిలువునా దోచుకుంటున్నారు. ఇదే క్రమంలో ఆర్టీసీ డీఎం ఆఫీస్ కింది భాగంలో కూడా ఇదే తంతు కొనసాగుతోంది. ఆయా ప్రాంతాల్లో సక్రమంగా లైట్లు లేకపోవడం వీరికి అనుకూలంగా మారింది. ఈ ముఠాల చేతిలో చిక్కి ఎందరో యాత్రికులు సైతం నిలువు దోపిడీకి గురైనట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, పోలీసులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని తిరునగరవాసులు కోరుతున్నారు. – తిరుపతి అర్బన్

